ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 03.12.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు హాజరు కావాల్సిందిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఈ ఉదయం న్యూఢిల్లీలో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

2. ఈరోజు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరుపుకుంటున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దివ్యాంగుల సాధికారతకు పాటు పడుతున్న వ్యక్తులు, సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు.

3. దేశంలో గడిచిన రెండేళ్లలో పంటల ఉత్పత్తిలో పంజాబ్ ను అధిగమించి తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

4. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమయ్యింది.

------------------------------

**ఆహ్వానం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఈ ఉదయం కలిశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8 , 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. అంతకుముందు కేంద్ర ఐటీ , సమాచార, ప్రసార, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ , కేంద్ర గృహనిర్మాణ , పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్లాల్ ఖట్టర్ తో కూడా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు హాజరుకావాలని కేంద్ర మంత్రులను వారు ఆహ్వానించారు. మరికొందరు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కూడా ముఖ్యమంత్రి ఈ వేడుకలకు ఆహ్వానిస్తున్నారు.

**జీఎస్**

--------------------------

**మంత్రులు రాష్ట్రాలు**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు. స్వయంగా మన రాష్ట్ర మంత్రులు వెళ్లి వారిని ప్రత్యేకంగా కలిసి ఈ సదస్సుకు ఆహ్వానించనున్నారు. జార్ఖండ్ కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. . జమ్మూ కాశ్మీర్ , గుజరాత్ లకు ఉత్తమ్ కుమార్ రెడ్డి.. పంజాబ్, హర్యానాలకు దామోదర్ రాజనర్సింహ.. ఆంధ్రప్రదేశ్ , కేరళకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెళ్లారు.

**జీఎస్**

**దివ్యాంగులు**

ఈరోజు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దివ్యాంగుల సాధికారతలో ఆదర్శప్రాయమైన కృషి చేసిన వ్యక్తులు , సంస్థలకు ఈరోజు న్యూఢిల్లీలో జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. దివ్యాంగుల సంకల్పం , అంకితభావం, సాధికారతను జరుపుకోవడం , వారి ధైర్యం , విజయాలను గౌరవించడం ఈ వేడుక లక్ష్యంగా ఉంది.

**NSD**

**పార్క్**

వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ ఎప్పరెల్ (పీఎంమిత్ర) పార్క్ లో 3 వేల 862 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని కేంద్ర జౌళిశాఖ సహాయమంత్రి పబిత్ర

మార్గరీటా తెలిపారు. దీనివల్ల 24 వేల 400 ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. ఆయన నిన్న లోక్‌సభలో నల్గొండ కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు.

**జీఎస్**

**కిషన్ రెడ్డి**

హిందువులకు సంబంధించిన దేవీదేవతలను అవహేళన చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను ఖండిస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందువుగా ఉంటూ , హిందువుల మీద, దేవీదేవతల మీద రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు.

**జీఎస్**

**రికార్డు**

రాష్ట్రం గత రెండేళ్లలో దేశం దృష్టిని ఆకర్షించేలా పంటల సాగులో సరికొత్త రికార్డులు నెలకొల్పిందని ప్రభుత్వం పేర్కొంది. వరి సాగు విస్తీర్ణం , దిగుబడి సాధనలో ఇటీవలి వరకు పంజాబ్ అగ్రస్థానంలో ఉండగా... దాన్ని తెలంగాణ అధిగమించింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో వ్యవసాయం వాటా 6.7% పెరిగింది. ప్రస్తుత ధరల ప్రకారం వ్యవసాయ రంగం వాటా 2023-24లో 1.04 లక్ష కోట్లు ఉండగా , 2024-25 అంచనాల ప్రకారం 1.07 లక్షల కోట్లకు చేరిందని వ్యవసాయ రంగ ప్రగతిపై రూపొందించిన నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

**జీఎస్**

**పంచాయతీ**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల తొలివిడత నామినేషన్ల ఉప సంహరణ ఈరోజుతో ముగుస్తుంది. 11వ తేదీన పోలింగ్ జరగనుంది.

మరోవైపు.. రెండో విడత నామినేషన్ల దాఖలు ప్రక్రియ నిన్న ముగిసింది. ఇక, మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమయ్యింది. జిల్లాల వారీగా

ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. మూడో విడతలో 4 వేల 159 గ్రామ పంచాయతీలకు 36 వేల 452 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎల్లుండి వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 17వ తేదీన మూడో విడత పోలింగ్ జరుగుతుంది.

**జీఎస్**

**రేవంత్ టూర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో పర్యటిస్తారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. 44 కోట్ల రూపాయలకు పైగా నిధులతో హుస్నాబాద్ లో నిర్మించే శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీకి శంకుస్థాపన చేస్తారు. దాదాపు 59 కోట్ల రూపాయలతో అక్కన్నపేట వరకు 4 లేన్ల హామ్ రోడ్డుకు, 20 కోట్ల రూపాయలతో హుస్నాబాద్ మున్సిపాలిటీలో పలు అభివృధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, 45 కోట్ల రూపాయలతో నిర్మించే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కు , ఎనిమిదిన్నర కోట్ల రూపాయలతో అధునాతన డ్రైవింగ్ ట్రాక్ తో కూడిన ఆర్టీఏ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు మరిన్ని పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారు. హుస్నాబాద్ నుండి హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ బస్సు ను జెండా ఊపి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం హుస్నాబాద్ లో జరిగే బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు.

**పీటీసీ - సిద్దిపేట**

**ధ్యాస్ చంద్**

ప్రపంచం గర్వించదగిన భారత హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ అని, ఆయన స్ఫూర్తితో క్రీడాకారులు రాణించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా , క్రీడలు యువజన శాఖ అధికారి రాందాస్ అన్నారు. ధ్యాన్ చంద్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...

**బైట్ - రాందాస్**

**పీటీసీ - సిరిసిల్ల**

**వన్డే**

మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా ఈరోజు రెండవ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ జట్టు తలపడుతుంది. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో ఈ మ్యాచ్ మధ్యాహ్నం ఒంటిగంటా ముప్పై నిమిషాలకు ప్రారంభమవుతుంది. తొలి వన్డేలో 17 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్ ప్రస్తుతం సిరీస్‌లో 1-0 తేడాతో ఆధిక్యంలో ఉంది.

**ఎస్ఎస్డీ**

**దివ్యాంగులు స్టేట్**

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవి మాట్లాడుతూ.. అంగవైకల్యం దేనికి అడ్డు కాదని , సంకల్పం, పట్టుదల, మనోధైర్యం ఉంటే అన్ని రంగాలలో రాణించవచ్చని, ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**వాతావరణం**

దేశంలోని మధ్య , వాయవ్య భారతంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని అధిక ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంటుందన్నారు. మరోవైపు.. దిత్వా తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు , తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలియజేసింది.

**పీఎస్**

**గ్రామీణ శ్రేయస్సు**

గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ శ్రేయస్సు కోసం ఉద్దేశించిన కార్యక్రమానికి జనగామ జిల్లాను ఎంపిక చేసిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామీణ శ్రామిక శక్తికి కొత్త నైపుణ్యాలను

అందించడంతో పాటు.. పెట్టుబడులను ప్రోత్సహించడం , వ్యవసాయం, ఇతర గ్రామీణ సంస్థలను మెరుగుపరచడానికి , కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

**పీటీసీ - జనగామ**

**రైల్వే**

రాష్ట్రంలో మూడు ట్రాక్షన్ సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంపుతో సహా ఐదు ప్రత్యేక రైల్వే ప్రాజెక్టులకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. ఈమేరకు వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. సికింద్రాబాద్-కాజీపేట సెక్షన్‌లో విద్యుత్ లైన్ల సామర్థ్యం పెంచేందుకు ఘట్‌కేసర్ , ఆలేరులలో కొత్త ట్రాక్షన్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తారు. పెద్దపల్లి జిల్లాలో ప్రస్తుత లెవెల్ క్రాసింగ్‌ల స్థానంలో మూడు కొత్త రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ)ల నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చింది.

**జీఎస్**

**ప్రమాదం**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీపంలోని కిష్టారం వద్ద ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పొగమంచు కారణంగా డివైడర్ను వేగంగా ఢీకొట్టడంతో ఈ రోడ్డు ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. కారు పూర్తిగా ధ్వంసమైంది.

**పీటీసీ - ఖమ్మం**

**నిఘా**

గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు నల్లగొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేసిన ఎస్పీ.. పలువురు పాత నేరస్థుల ఇళ్లకు వెళ్ళారు. నేర చరిత్ర ఉన్న వారంతా సత్ప్రవర్తన తో మెలగాలని సూచించారు..

**పీటీసీ - నల్గొండ**